ప్రజాశక్తి
సోమవారం 1 ఏప్రిల్ 2024
5
కర్నూలు



వరుస రోడ్డు ప్రమాదాల్లో

ఐదుగురు కూలీల దుర్మరణం

ప్రజాశక్తి-మద్దికేర /ఆలూరు

కర్నూలు జిల్లాలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు కూలీలు మృతిచెందారు. ఆలూరు మండలం హత్తిబెళగల్ బస్టాండ్ ఆవరణలో శనివారం ఆటో బోల్తాపడిన ఘటనలో అదేరోజు ఒకరు మస్తానమ్మ(40) మృతిచెందారు. ఆస్పత్రుల లో చికిత్స పొందుతూ ఆదివారం మరోఇద్దరు మృతి చెందారు. హులేబీడు గ్రామానికి చెందిన ఆదోని ప్రైవేట్ ఆసుపత్రిలో దస్తగిరమ్మ(55), కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో షేకున్‌బీ(30) మృతి చెందారు. తాజాగా ఆదివారం మద్దికేర సమీపంలో వ్యవసాయ కూలీలు వస్తున్న టాటా ఏస్ టైర్ పేలి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడటంతో ఇద్దరు వ్యవసాయ కూలీలు ఆదిలక్ష్మి(50), తాయమ్మ(48) మృతి చెందారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు ... మద్దికేరకు చెందిన 40 మంది వ్యవసాయ కూలీలు చిప్పగిరి గ్రామంలో మిరపకాయల కోత తెంచేందుకు ప్రతిరోజు వెళ్లేవారు. ఆదివారం కూడా మిరపకాయలు తెంచి తిరిగి వస్తుండగా కోతులమాను దగ్గర టాటా ఏస్ టైర్ వేలడంతో ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ముందు కూర్చున్న ఆదిలక్ష్మి, తాయమ్మ, అక్కడికక్కడే మృతి చెందారు. 15 మందికి స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గుంతకల్ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన ఐదుగురిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆలూరు మండలం అత్తి బెలగల్ గ్రామం వద్ద చిప్పగిరికి వెళ్లి వస్తూ వ్యవసాయ కూలీలు టాటా ఏస్ టైరు పేలి బోల్తా పడిన సంఘటన మరవక ముందే మరో ఘటన మద్దకేరలో జరగడం ఆందోళన కలిగిస్తుంది. ప్రమాదంలో మృతిచెందిన చెందిన వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన కూలీలు



వద్యుత్ స్తంభాన్ని ఢీకొని నుజ్జునుజ్జు అయిన టాటాఏస్

చేనేతలకు

ఫైనాన్స్ కార్పొరేషన్

- టెక్స్ టైల్ పార్క్ తీసుకొస్తాం - రాయలసీమ ద్రోహిజగన్

- ఎమ్మిగనూరు ప్రజా గళం సభలో చంద్రబాబు

ఎమ్మిగనూరు ప్రజా గళం సభలో చంద్రబాబు



ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

చేనేతలకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ప్రజాగళం యాత్ర ఆదివారం ఎమ్మిగనూరులో నిర్వహించారు. శ్రీకాళహస్తి నుండి హెలికాప్టర్‌లో ఎమ్మిగనూరులోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. స్పిన్నింగ్ మిల్ గ్రౌండ్ నుండి అన్నమయ్య సర్కిల్, శివసర్కిల్, సోమప్పసర్కిల్ మీదుగా తేరుబజార్ వరకు రోడ్ షో నిర్వహించారు. అనంతరం తేరుబజార్‌లో నిర్వహించిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ ఎమ్మిగనూరులో టెక్స్ టైల్ పార్క్ తీసుకొస్తామన్నారు. చేనేతకు 200 యూనిట్లు, పవర్ లూముకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. రాయలసీమ ద్రోహి జగనని, ఆయనకు ఓటు వేస్తే మనమెత్తిన మనమే చెత్త వేసుకున్నట్లేనని తెలిపారు. తాము రాయలసీమకు రూ.12వేల కోట్లు ఖర్చు చేస్తే జగన్ రూ.2వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారన్నారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని కర్నూలు జిల్లా దిశా,దశ మార్చి భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తామని హామీ ఇచ్చారు. బుట్టా రేణుక పేద మహిళ అని జగన్ చెప్పారని, 2014లో ఎన్నికల అఫిడవిట్ ప్రకారం ఆమె ఆస్తి రూ.250 కోట్లని తెలిపారు. ఇసుక, మట్టి, మంత్రాలయం దేవుడిని మింగేసిన వ్యక్తి పేదవాడు అంట అని అవాక్కులు పేల్చారన్నారు. మంత్రాలయం, ఆదోని, గుంతకల్లు వాళ్ల సామ్రాజ్యం అయిపోయిందన్నారు. ఒకప్పుడు వాళ్ళ నాన్న కూడా టిడిపినే అని గుర్తు చేశారు. గోదావరి నీళ్ల రాయల సీమకు తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

కర్నూలు పార్లమెంటులో ప్రతి ఎకరాకి నీళ్ల ఇవ్వడమే తన జీవితాశయమని అన్నారు. అవసరమైతే కృష్ణ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీళ్ల ఇస్తామని హామీ ఇచ్చారు. ఆర్‌డిఎస్ కుడి కాలువ, గుండ్రేవుల, వేదవతి పూర్తి చేస్తామన్నారు. చేనేతలకు ముడి సర్కులో రాయితీ కల్పిస్తామన్నారు. గుడికల్ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పూర్తి చేస్తామని, వాల్మీకి భవన్, అంబేద్కర్ భవన్, జామియా మసీద్ పూర్తి చేస్తామని, ఇంటింటికి నీళ్ల ఇస్తామని, టమాటా కోల్డ్ స్టోరేజీలు నిర్మిస్తామని హామీలు ఇచ్చారు.

సమస్యలపై వినతి

జిల్లా సమస్యలపై, ఎమ్మిగనూరు నియోజకవర్గ సమస్యలపై టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బివి.జయ నాగేశ్వర్ రెడ్డి, ఎంపి అభ్యర్థి పంచలింగాల నాగరాజు జిల్లాలో తాగునీరు సాగునీరు కోసం ఆర్‌డిఎస్ కుడి కాలువ, వేదవతి, గుండాల ప్రాజెక్టులు పూర్తిచేసి, గురు రాఘవేంద్ర ప్రాజెక్టు లిఫ్ట్ ఇరిగేషన్లు పూర్తి చేసి తమ జిల్లా ప్రజలను ఆదుకోవాలని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. తాగు, సాగునీటి సమస్యతో పాటు, టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేసి చేనేతను ఆదుకోవాలని, పట్టణ తాగునీటి సమస్యను తీర్చాలని కోరారు. మైనార్టీల కోసం ఉర్దూ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిని ఎయిమ్స్ స్థాయిలో అభివృద్ధి చేయాలని కోరారు. టెక్స్‌టైల్ పార్క్ కోసం టిడిపి ప్రభుత్వం హయంలో కేటాయించే స్థలం, గుడికల్ వద్ద సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ కోసం భూమిని వైసిపి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అనుచరులు రియల్ ఎస్టేట్ కోసం వాడుకున్నారని వాటిపై సమగ్ర న్యాయవిచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే హామీలను నెరవేరుస్తామని చంద్రబాబు తెలిపారు. సభలో టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించండి

ప్రజలకు సిపిఎం పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మతోన్మాద బిజెపిని దానికి మద్దతు తెలుపుతున్న, వైసిపి టిడిపి ,జనసేనలను చిత్తుచిత్తుగా ఓడించాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ మొహమ్మద్ షరీఫ్, సిపిఎం సీనియర్ నాయకులు డి.పార్వతయ్య ప్రజలను కోరారు. కర్నూలు నగరంలోని ఒకటో వార్డు పలు వీధులలో సిపిఎం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కర్నూలు సిపిఎం అసెంబ్లీ అభ్యర్థికి మీ విలువైన ఓట్లు వేసి, వేయించి గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. షేక్ మొహమ్మద్ షరీఫ్, డి.పార్వతయ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇస్తానని తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామికి సాక్షిగా చెప్పి షటగోపం పెట్టిందన్నారు. విభజన హామీలు అమలుచేయని, కడప ఉక్కు ఫ్యాక్టరీ, రాయలసీమ ప్రత్యేక ప్యాకేజీ, ఒక్కటంటే ఒక్కటి కూడా బిజెపి హామీ అమలు చేయలేదన్నారు. అటువంటి బిజెపికి మన రాష్ట్రానికి సర్వనాశనం చేసిన, కేంద్ర ప్రభుత్వానికి నిస్సిగ్గుగా వైసిపి, టిడిపిలు బిజెపికి ఆంధ్ర ప్రజల ఆత్మగౌరవాన్ని నరేంద్ర మోడీ పాదాల దగ్గర పెట్టి, వారి కేసుల నుండి తప్పించుకోవాలని, ఆంధ్రప్రజలను బలి చేస్తున్నారని దుయ్యబట్టారు. విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మేస్తామన్న, ఎన్‌ఆర్‌సి, సిఎఎ, ఆర్టికల్ 370 ,రైతులకు వ్యతిరేకంగా, కార్మికులవ్యతిరేకంగా, దళితులకు, మైనార్టీల వ్యతిరేకంగా, ఉన్న ఈ దుష్ట కూటమిని చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. ఇండియా కూటమి బలపరుస్తున్న, సిపిఐ, కాంగ్రెస్‌కలిసి ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్న, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న సిపిఎం అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.



షరీఫ్ నాయకత్వంలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజా సమస్యలు మరచి ఓట్లు అడిగే పార్టీలకు బుద్ధి చెప్పండి

పజా సమస్యల మరిచి ఓట్లు అడిగే పార్టీలకు తమ ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని సిపిఎం జోన్ బాధ్యులు పి.గోవిందు ప్రజలను కోరారు. కర్నూలు నగరం 11వ వార్డు ఎర్రబురుజులో సిపిఎం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పి.గోవిందు మాట్లాడుతూ పదేళ్ల నుండి కేంద్రంలో బిజెపి అధికారంలో ఉండి ప్రజా సమస్యలను పట్టించుకోకుండా దేశంలోని బడా కార్పొరేట్లకు సంపదను దోచిపెట్టిందని విమర్శించారు. ప్రజలపై అన్ని రకాల భారాలు మోపారన్నారు. 11వ వార్డు ఎర్రబురులో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని వెంటనే పరిష్కరించాలని సిపిఎం కోరిందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో సిపిఎం సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.



గోవిందు నాయకత్వంలో మహిళకు కరపత్రాలను అందజేస్తున్న సిపిఎం నాయకులు

'విస్మృత కార్యకర్త' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

అభ్యుదయ రచయితల సంఘం కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సి క్యాంప్ సెంటర్‌లోని లలిత కళాసమితిలో గామాగో విస్మృత కార్యకర్త పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. కథా రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ అధ్యక్షత జరిగిన సమావేశంలో అతిథులను డాక్టర్ కె. చంద్రమౌళిని వేదికపైకి ఆహ్వానించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు పుస్తకావిష్కరణ చేశారు. గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర, లలితకళాసమితి అధ్యక్షులు పత్తిఓబులయ్య, రాయపాటి శ్రీనివాస్ పాణ్యం నాగార్జున గడ్డం అమర్ నాథ రెడ్డి, భార్గవ, శ్రీనివాసరాలు, జి.ఉమా మహేశ్వర్, సాహితీస్రవంతి రాష్ట్రకార్యదర్శి, కవి కథా రచయిత జంధ్యాల రఘుబాబు, ఆంధ్రసారస్వత పరిషత్ నాయకులు పుల్లారామాంజనేయులు పాల్గొన్నారు. సభలో వక్తలు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో గామాగో ఆత్మకథకు ఒక ప్రత్యేక స్థానం ఉందని, ఎవరికీ తెలియని బనగానపల్లె సంస్థాన స్వాతంత్ర పోరాటాన్ని ఇనాం భూముల రద్దు కొరకు జరిగిన కరివేన సత్యాగ్రహాన్ని వివరంగా మొదటిసారి రికార్డు చేసిన పుస్తకం ఇదన్నారు. 1918 –2022ల మధ్య జరిగిన భారతీయ రాజకీయాలను ఆంధ్ర దేశం మీద వాటి ప్రతిఫలాలను ఆనాటి నాయకుల ద్వంద వైఖరులను కళ్ళకు కట్టినట్లు వివరిస్తుందన్నారు. ఆచరణ వాది, నిస్వార్థ ప్రజానాయకుడు, నిరంతర పోరాట యోధుడు అయిన ఎంవి.సుబ్బారెడ్డి నాస్తికునిగా మారాక కులమత ప్రాంతాలను సూచించకు ండా అతని జీవన మీద వివిధ దశలలో ప్రభావం చూపిన ముగ్గురు మహనీయులు గాంధీ, మార్క్స్, గోర పేర్లలోనే మొదటి అక్షరాలను స్వీకరించి తన పేరును గామాగో అని మార్చుకున్నాడన్నారు. గామాగోకు వ్యక్తిత్వం, ఆలోచనలో నిజాయితీ, ఆచరణలో నిబద్ధత, మనల్ని నెవ్వెర పరుస్తాయి. ఆయన శక్తిసామర్థ్యాలకు విస్తుపోతామన్నారు. ఉద్యమం ఎలా నడపాలో వారి ఆత్మకథ చదివితే తెలుస్తుందని అన్నారు.గామోగో ఈ దేశానికి చేసిన సేవకుగాను గౌరవంతో, అభిమానంతో గామాగో వారి కుమార్తె ముక్కమల్ల ధరిత్రీదేవి ప్రసిద్ధ రచయిత్రులు, తెలుగు అధ్యాపకులు డాక్టర్ దండబోయిన పార్వతీదేవి, ఎన్.నాగమణి, కల్యాణ దుర్గంస్వర్ణలత, జంగం స్వయంప్రభ, డాక్టర్ కె.చంద్ర మౌళిని, హరిసింహనాయుడు, డాక్టర్.చిన్నావుల రాజారెడ్డి, గౌరెడ్డి హరిశ్చంద్రా రెడ్డి ఘనంగా సత్కరించారు. అభ్యుదయ రచయితల సంఘం కర్నూలు జిల్లా శాఖ సభ్యులు రాణి లీలావతి, ప్రమోద్ చక్రవర్తి, సయ్యద్ జహీర్ అహమ్మద్, రాజా రమేష్, రేవుల శ్రీనివాసులు సభను నిర్వహించారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు



పాఠశాల వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న జి.పుల్లయ్య

లక్ష్యంతో ముందుకెళ్లాలి : పుల్లయ్య

ప్రజాశక్తి-మద్దికేర

విద్యార్థులు జీవిత లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని, ప్రయవేటు విద్యాసంస్థల యాజమాన్య రాష్ట్ర అడ్వయిజర్ జి.పుల్లయ్య సూచించారు. మద్దికేరలో శ్రీ విద్యాసాయి స్కూల్లో వార్షికోత్సవ వేడుకలు ఆదివారం రాత్రి ఎంతో ఉత్సాహంగా సాగాయి. జి.పుల్లయ్య మాట్లాడుతూ కష్టంతో కాకుండా ఇష్టపడి చదివితే లక్ష్యంవైపు రాణిస్తారని అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ నిజమైన దేశభక్తులుగా ఎదగాలని అన్నారు. చిన్నారులు పాటలకు అనుగుణంగా చేసిన నృత్యాలు ఎంతగానో ఆలరించాయి. చిన్నారులు ఎంతో ఉల్లాసంగా ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సాయిసుబ్బయ్య రవీంద్ర విద్యాసంస్థల అధినేత సాయిసుబ్బయ్య, విద్యాసాయి స్కూల్ కరస్పాండెంట్ యజ్ఞం వెంకట మాధవ్, ప్రిన్సిపల్ సుజాత ,సునీత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందు ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

సిఎం ఇఫ్తార్ విందు ఏర్పాట్లను పరిశీలించిన హఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా కదిరి పివిఆర్ పంక్షన్‌హాలులో సోమవారం జరగబోయే ఇఫ్తార్ విందు ఏర్పాట్లను కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హఫీజ్‌ఖాన్ ఆధ్వర్యంలో పరిశీలించారు. కర్నూల్ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, వైసిపి అభ్యర్థి మాక్బుల్ అహ్మాద్, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ బాషా, వైసిపి నాయకులు కలిసి పివిఆర్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఇఫ్తార్ విందు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కదిరి నియోజకవర్గంలో జామియా మస్జిద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఖాదర్ బాషా పాల్గొని మత పెద్దలతో కలిసి దువా చేశారు. ఈ కార్యక్రమం లో వైసిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పొట్టకూటి కోసం వెళ్లి కూలీలు మృతి

రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా ఆలూరు మండలం హులేబీడు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు పొట్టకూటి కోసం చిప్పగిరి మండలానికి మిరపకాయలు తెంచడానికి వెళ్లి తిరిగి వస్తూ ఆటో ప్రమాదంలో గాయాలపాలై శనివారం ఒకరు ఆదివారం ఇద్దరు కూలీలు మరణించారు. ఆదివారం మద్దికేర మండల కేంద్రంలో ఉండే వ్యవసాయ కూలీలు మిరపకాయలు తెంచడం కోసం చిప్పగిరి వెళ్లి తిరిగి వస్తూ ఆటో ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడ మృతి చెందారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.వీరశేఖర్, కెవి.నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం జిల్లాలో తీవ్రమైన కరువు ఛాయలు ఉన్నందువల్ల గ్రామీణ పేదలు పట్టెడన్నం కోసం సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు. ఎక్కడ పనులు ఉంటే అక్కడికి ప్రమాదం తెలిసినా ఆటోలు వెళ్లి వస్తున్నారు. ఇలాంటి పరిస్థితి నెలకొన్న జిల్లాలో ఉపాధి హామీ పని దినాలు పెంచి వలసలు అరికట్టాలనే బాధ్యతను ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. కరువు మండలాల్లో 50 రోజుల పనిదినాలు పెంచుతున్నామని చెప్పి ప్రకటన చేసి రెండు నెలలు అవుతున్నా నేటికీ పనులు కల్పించకపోవడంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. వ్యవసాయ కూలీల కోసం ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయని, పేదల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ఆదుకొని ప్రతి కుటుంబానికి రూ 25 లక్షలు చెల్లించాలని, వలసలు వెళ్లకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. పనిచేసిన వారంలోగా వేతనాలు వచ్చేలాగా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో పార్టీలకతీతంగా అతీతంగా జిల్లా కలెక్టర్ కూలీలపైన దృష్టి పెట్టాలని చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్

కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఈస్టర్ వేడుగలు ఘనంగా నిర్వహించారు. సిలువ వేయబడిన క్రీస్తు మరణాన్ని జయించి తిరిగి లేచాడని, ఆ ఖాళీ సమాధి నిత్య జీవానికి మార్గమని సిస్టర్ దీన అన్నారు. ఆదివారం ఈస్టర్ పర్వదినాన్ని పుర్కరించుకుని షమ్మా చర్చిలో జరిగిన సూర్యోదయ ఆరాధనలో ఆమె ముఖ్య సందేశం ఇచ్చారు. తెల్లవారుజామున స్త్రీలు ప్రత్యేక ప్రార్ధనలు చేయడం పరిపాటి. ఇందులో భాగంగా షమ్మా చర్చిలో ప్రత్యేక ప్రార్ధనలు జరిగాయి. గాయకబృందం సంపత్ కుమారి, కేతుర, కవితాగ్రెస్, దివ్య, రేఖ, హెప్సి, ఝాన్సి ప్రత్యేక గీతాలు ఆలపించారు.

క్రీస్తు జీవించిన రోజుల్లో ఆయన చేసిన బోధలు కొంతమేర జీవితాలలో మార్పులు తెచ్చినప్పటికీ ఆయన మరణం, పునరుత్థానం అనేక జీవితాలను మార్చిందని డాక్టర్ బి స్టీఫెన్ చార్లెస్ అన్నారు. ఈస్టర్ పర్వదినాన్ని పుర్కరించుకుని కర్నూలు ఆర్‌ఎస్‌కూడలిలో ఉన్న యెహోవా షమ్మా చర్చిలో జరిగిన ప్రత్యేక ఆరాధలో ఆయన ఈస్టర్ సందేశాన్ని ఇచ్చారు. జయంతి, హెప్సి, శ్రీప్రియ, శిరీష, ఝాన్సి ప్రత్యేక గీతాలు ఆలపించారు.నగరంలోని అన్ని ప్రధాన చర్చిలతో పాటు ప్రతి ప్రార్ధనా మందిరంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి.

సి బెళగల్ : సిబెళగల్ మండలంలో ఏసుక్రీస్తు పునఃరుత్తాన పుణ్య దినోత్సవం వేడుకలు భక్తిశ్రద్దలతో సాగింది. ప్రతి ప్రార్ధన ఆలయంలో క్రైస్తవులు కూడి జగతి మేలు కోసం ప్రాణాలు అర్పించిన ప్రసంగంతో మత పెద్దల సమక్షంలో ప్రభోదకులు ప్రార్ధనలు చేశారు.



సందేశం ఇస్తున్నసిస్టర్ దీన - పాట పాడుతున్న జయంతి, హెప్సి, శ్రీప్రియ

తుగ్గలి : మండల కేంద్రమైన తుగ్గలి, రాతన, జొన్నగిరి, పెండేకల్లు, ఎద్దులదొడ్డి, అమీనా బాద్ తదితర గ్రామాలతో పాటు వివిధ గ్రామాలలో ఈస్టర్ సందర్భంగా ఆదివారం చర్చిలలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాలలో పాస్టర్లు సుధాకర్, సువర్ణరాజు, రాజు, కృపానందం, పాల్ రాజు తదితరులు ఏసుక్రీస్తు పునరుజ్జీవం గురించి ప్రజలకు తెలిపారు. గుడ్ ఫ్రైడే రోజు శిలువ పై మృతి చెంది ఆదివారం రోజు మృత్యుంజయుడయి లేచిన ఏసుక్రీస్తును గూర్చి పాస్టర్లు వివరించారు.

కూలీల అడ్డాలో చలివేంద్రాలు, చలువ పందిళ్లు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని భవన నిర్మాణ కార్మికుల అడ్డాల్లో చలివేంద్రాలు, చలువ పందిళ్ళు ఏర్పాటు చేయాలని ఎపి భవన ఇతర నిర్మాణ రంగ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్‌డి ఖాజా పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు సూర్జిత్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌డి.ఖాజా పాషా మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నుండి భవన నిర్మాణ కార్మికుల అడ్డాలో అవసరమైతే మజ్జిగ కూడా సరఫరా చేయాలన్నారు. రోజు రోజుకు వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో అడ్డాల్లో కనీస వసతులు ఏర్పాటు చేయడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. జగన్‌ప్రభుత్వంలో కార్మికులకు సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారని అన్నారు. జగన్ ప్రభుత్వంలో భవన నిర్మాణ కార్మికులకు ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయలేదన్నారు. కార్మికుల సంక్షేమం నిధి రూ.875 కోట్లు రాత్రికి రాత్రి గజదొంగల్లా డబ్బులు కాజేశారని మండిపడ్డారు. ప్రధాన రోడ్లలో సిగ్నల్స్ ఉన్న ప్రతి చోట చలో పనులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నగర నాయకులు ఎస్.మూస, సయ్యద్‌బాబు, ఎస్.జావీద్, ఆర్షద్‌బాష పాల్గొన్నారు.





ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఓటు గౌరవం గుర్తింపు మన బాధ్యత అని అదనపు కమిషనర్ పివి. రామలింగేశ్వర్ అన్నారు. శనివారం రాత్రి కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎ.భార్గవ్ తేజ ఆదేశాల మేరకు కర్నూల్ నగర నడిబొడ్డున, కొండారెడ్డి బురుజు ఎదుట, ఓటు హక్కు వినియోగం ప్రాముఖ్యతను ప్రజలకు తెలుపుతూ అధికారులు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఓటు మన గౌరవం, ఓటు మన గుర్తింపు, ఓటు మన బాధ్యత' అని అదనపు కమిషనర్ పివి. రామలింగేశ్వర్ సూచించారు. దేశభక్తి గీతాల సమాహారానికి, ఫ్యూచర్ స్టార్స్‌నృత్య బృందం చిన్నారులు చేసిన నత్య ప్రదర్శనలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్పొరేషన్ మేనేజర్ ఎన్.చిన్నరాముడు , ఎలక్షన్ డిటి. ధనుంజయ , ఎఇ దినేష్ , సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ డాక్టర్ పెంచలయ్య పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ నిలిపేయడం అన్యాయం

కాటసాని రాంభూపాల్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : న్నికల వరకు అవ్వ,తాతలు, వితంతువులు, వికలాంగులకు వాలంటీర్లతో పింఛన్ల పంపిణీని నిలిపివేయడం అన్యాయమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాలంటీర్లు ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నారని అన్నారు. అదేవిధంగా కరోనాలో కూడా వారి సేవల ద్వారా ప్రజలకు మంచి జరిగిందన్నారు. గతంలోవృద్ధులు, వికలాంగులు, వితంతువులు పింఛన్ కోసం అనేక ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో ఎన్నడు కూడా పింఛన్ల కోసం ఇబ్బందులు పడకుండా లబ్ధిదారుల ఇంటివద్దకు వెళ్లి పంపిణీ చేసినట్లు చెప్పారు. అలాంటిది ఎన్నికలను అడ్డుపెట్టుకొని వారి సేవలను నిలిపివేయడం సరైందికాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల్లో లబ్ధిదారులు నష్టపోయే పరిస్థితి ఉందని చెప్పారు. వాలంటీర్లద్వారా పంపిణీ చేసేలా చూడాలన ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. కల్లూరు మండలం సింగిల్ విండో ప్రెసిడెంట్ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ పందిపాడుకు చెందిన భీమేష్ రెడ్డి, భవాని, రామకృష్ణల సమక్షంలో బిజెపి టిడిపి, జనసేన పార్టీల నుండి 150 కుటుంబాలు వైసిపిలో చేరాయన్నారు. వైసిపి నేత భీమేష్‌రెడ్డి మాట్లాడుతూ మరోసారి వైసిపి గెలిపిస్తామన్నారు. వైసిపి నాయకులు పాల్గొన్నారు

ఆటో బోల్తా ఘటనలో
మరో ఇద్దరు కూలీలు మృతి

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు మండల పరిధిలోని హత్తిబెళగల్ బస్టాండ్ ఆవరణలో శనివారం చోటు చేసుకున్న వ్యవసాయ కూలీల ఆటో బోల్తా ఘటనలో విషమంగా ఉన్న వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరో ఇద్దరు మృతి చెందారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు హులేబీడు గ్రామానికి చెందిన అబ్దుల్ షేక్షావలి భార్య దస్తగిరమ్మ(55) ఆదోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందింది. ఈమె కొడుకు ఏడాది కింద గ్రామ సమీపంలో రోడ్ ప్రమాదంలో మృతి చెందాడు. మరో కొడుకు, కూతురు ఉన్నారు. గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్(సీనియర్ మేట్)గా పనిచేస్తున్న మాదిగ్ సాబ్ భార్య షేకున్ బీ(30) కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతి చెందింది. ఈమెకు ముగ్గురు చిన్న వయస్సు కొడుకులు ఉన్నారు. వీరందరిదీ హులేబీడు గ్రామానికి చెందిన ఒకే సామాజిక వర్గం కావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.


దస్తగిరమ్మ, 3. షేకున్ బి (ఫైల్ ఫోటోస్)

పోలింగ్ డివిజన్ కేంద్రాల్లోనే శిక్షణ ఇవ్వాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి - ఆదోని

పోలింగ్ సిబ్బందికి డివిజన్ కేంద్రాల్లోనే శిక్షణ తరగతులు నిర్వహించాలని ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ బి మహదేవప్ప, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, సీనియర్ నాయకులు వెంకోబ, సత్యన్న కోరారు. ఆదివారం ఆదోనిలోని ఎస్టీయు భవన్‌లో మండల ప్రధాన కార్యదర్శి బి సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణా తరగతులను జిల్లా కేంద్రాల్లో నిర్వహిం చడం ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు పోలింగ్ విధుల నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పోలింగ్ సిబ్బందిని 6 ప్లస్ రెండుగా ఉండేలా చూడాలని పోలింగ్ రిటర్నింగ్ అధికారులను కోరారు. పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ విధులకు హాజరయ్యే మహిళా ఉద్యోగులకు అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు బి రామాంజ నేయులు, మండల అధ్యక్షుడు రామకృష్ణ, మండల గౌరవాధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, మండల ఆర్థిక కార్యదర్శి షేక్షావలి, కౌతాళం మండల నాయకుడు అంజనయ్య, వెంకటేశులు, భాస్కర్, కోటేశ్వరయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

'ప్రజాగళం'కు తరలిన తెలుగు తమ్ముళ్లు


ప్రజాగళంకు వెళుతున్న టిడిపి సీనియర్ నాయకులు వెంకటరామిరెడ్డి కార్యకర్తలు

ప్రజాశక్తి - నందవరం

ఎమ్మిగనూరులో తలపెట్టిన ప్రజాగళం సభ అన్ని గ్రామాల్లోని టిడిపి శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. టి. సోమాల గూడూరు గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ డైరెక్టర్ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున టిడిపి శ్రేణులు ప్రజాగలం కార్యక్రమానికి బయలుదేరారు. టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు వస్తున్న కార్యక్రమాన్ని విజయం వంతం చేయాలని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బివి జయ నాగేశ్వర రెడ్డి ఆదేశించిదంతో గ్రామాల్లో ఎటుచూసిన పసుపు మయంగా మారింది. నందవరంలో నాగరాజ్ గౌడ్, మాధవ రావు దేశాయ్, గురురాజ్ దేశాయ్, పూలచింతలో బండే గురు స్వామి, షరీఫ్, మిట్ట సోమాపురంలో వీరేష్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలతో సమావేశానికి బయలుదేరారు. మండలంలో వందల సంఖ్యలో ఆటోలో ఏర్పాటు చేసుకొని టిడిపి శ్రేణులు బయలు దేరడంతో రోడ్లన్నీ కిక్కిరిసాయి. బివి జయ నాగేశ్వర రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకుని, చంద్రబాబును సీఎం కావాలని నినాదాలు చేస్తూ టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బయలుదేరారు.

కన్నడ భక్తులకు ఉచిత అన్నదాన, వైద్య శిబిరం

ప్రజాశక్తి - నందవరం

శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనార్థమే కాలినాక వెళుతున్న కర్ణాటక భక్తులకు పోనకలదిన్నె గ్రామస్తులా అందరి సహకారంతో అన్నదాన కార్యక్రమ నిర్వహిస్తున్నారు. అన్నదానానికి ప్రతి సంవత్సరం ఎమ్మిగనూరుకు చెందిన స్పిన్నింగ్ మిల్ నీలప్ప ప్రతి సంవత్సరం 25 కేజీల కంది బ్యాళ్లను అందిస్తున్నారని, అలాగే గ్రామ ంలో దాదాపు ప్రతి ఇంటి నుండి ఏదో ఒక వస్తువును అన్నదానం కార్యక్రమానికి దానంగా అందిస్తున్నారు. గ్రామ పెద్దల సమక్షంలో గ్రామ ప్రజల సహకారంతో అన్నదానం కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు.


అన్నదానం, వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీధర్ స్వామి సమక్షంలో ఉచిత వైద్య శిబిరం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తరపున పోనకలదిన్నె గ్రామంలోని కర్ణాటక భక్తులకు టి. సోమాల గూడూరు గ్రామానికి చెందిన డాక్టర్ శ్రీధర్ స్వామి సమక్షంలో గత 10 సంవత్సరాలుగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. వైద్య శిబిరంలో భక్తులకు మందులు, టాబ్లెట్లు, ప్రథమ చికిత్స అందిస్తూ భక్తులకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. చాలా దూరం నుండి వస్తున్న భక్తులకు డాక్టర్ శ్రీధర్ స్వామి బందం వైద్య సేవలు అందిస్తుండడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సుజయీంద్ర ఆరోగ్యశాలలో
మెగా ఉచిత వైద్య శిబిరం

- పీఠాధిపతి సుభుదేంద్రతీర్థులు హర్షం - 472 మందికి ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న శ్రీ సుజయీంద్ర ఆరోగ్య శాలలో మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుపై పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం తమిళనాడు రాష్ట్రంలోని అరక్కోణానికి చెందిన రాఘవేంద్ర ట్రస్టు నేతృత్వంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఘవేంద్ర స్వామి ఆశీస్సులతో ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య సదుపాయాలు కల్పించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులను వైద్య బృందాన్ని శేష వస్త్ర ఫల మంత్రాక్షతలు మెమొంటో అందజేసి ఆశీర్వదించారు. ఈ మెగా వైద్య శిబిరం ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీ మతి గిరిజా గణేష్, జివి సురేష్, డాక్టర్ శంకర్, వైద్య నిపుణులు ఆర్థోపెడిక్, డయాబిటిస్, కార్డియాలజీ, డెర్మటాలజీ, న్యూరాలజీ, సిద్ధ హస్తులైన వైద్య బృందం అత్యాధునిక యంత్రాలతో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 472 మందికి ఉచిత వైద్య సేవలు అందించడం జరిగిందని నిర్వాహకులు ట్రస్టు సభ్యులు ప్రకాష్ తెలిపారు. శ్రీ సుజయీంద్ర ఆరోగ్య శాల వైద్యులు డాక్టర్ సుజయీంద్ర కోఆర్డినేటర్ విజయీంద్ర ఫార్మసిస్టు ప్రదీప్‌తో పాటు ఇతర సిబ్బంది సంపూర్ణ సహకారం అందించడం వల్ల మెగా వైద్య శిబిరం విజయవంతం అయిందని నిర్వాహకులు జివి సురేష్ పేర్కొన్నారు.


ఉచిత వైద్య సేవలో వైద్యులు

ఎస్‌సి హాస్టళ్లకు మహర్దశ కలిగేనా ?

ప్రజాశక్తి - ఆదోని

కార్పొరేట్‌కు దీటుగా విద్యను అందిస్తామని ప్రగల్భాలు పలికిన పాలకులకు షరా మామూలు అయింది. కార్పొరేట్ కాదు కదా కనీసం దోమలు, ఈగలు బారిన పడకుండా కూడా నివారణ చర్యలు చేపట్టలేని పరిస్థితుల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇలాంటి దుర్భరమైన పరిస్థితుల్లో చదువు ఎలా కొనసాగేదని విద్యార్థులు ఆవేదన చెందుతున్న పరిస్థితి. ఆదోని సబ్ డివిజ న్లోని బాల, బాలికలకు మెరుగైన వసతులతో కూడిన సౌకర్యాలు కల్పించాలన్న సదుద్దేశంతో అప్పటి సీఎం రాజశేఖర్ రెడ్డి హయాంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ లను నెలకొల్పారు. ఆదోనిలో బాలికలు, ఆలూరు, నందవరం ప్రాంతాలలో బాలురకు ఈ ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లు ఉన్నాయి. ఈ హాస్టల్‌లో నాలుగో తరగతి నుండి పదవ తరగతి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు వసతి పొందుతూ చదువుకునే సౌలభ్యం ఉంది. ఒక్కో హాస్టల్లో 400 మంది విద్యా ర్థులు వసతి పొందేందుకు భవనాల నిర్మాణం జరిగాయి. మొదట్లో భవనాలు సుందరంగా ఉండేవి ప్రస్తుతం పాడుబడ్డ వాటిల కనపడుతున్నాయి.

కరువైన ఆలనా పాలన: ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవన నిర్మాణాలు జరిగి దశాబ్ద కాలం గడిచిపోయింది. అప్పటి నుండి భవనాల గోడలకు సున్నం, రంగులు వేయడం మరిచారు. కిటికీలు అద్దాలు పగిలిపోవడంతో ఈగలు, దోమలు ఆహార పదార్థాలపై వాలి రోగాలబారిన పడుతున్నామని విద్యార్థులు చెబుతు న్నారు. వర్షాకాలంలో వర్షం జల్లులు గదుల్లోకి ఈస్తుండడంతో పుస్తకాలు బట్టలు తడిచిపోతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. కిటికీలకు అద్దాలు లేని కారణంగా చలికాలంలో చలి తీవ్రతకు తట్టుకోలేక అల్లాడు ఉండిన చలికి గజ గజ వణుకుతున్న పరిస్థితి అని ఆందోళన చెందుతున్నారు.


ఆవరణంలోనే నిలిచి ఉన్న మురుగునీరు
హాస్టల్ కిటికీలకు అద్దాలు పగిలిన దృశ్యం

తాగునీటికి తప్పని ఇబ్బందులు

ఆదోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో తాగునీటి కోసం విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీగా మున్సిపల్ ట్యాంకర్ నీటిపైనే ఆధార పడాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా నేరుగా కొళాయి ఏర్పాటు చేసి నీటి సరఫరా చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. నాడు నేడు కింద స్కూల్ భవన నిర్మాణ రూపురేఖలు మారు స్తున్న ప్రభు త్వము హాస్టల్లో మరమ్మతులకు చర్యలు తీసు కోక పోవడం ఏమిటని, ఇలా అయితే విద్యార్థులు ఉండలేక హాస్టల్లో మూతపడే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే జూన్ మాసంలోనైనా భవన నిర్మాణ మరమ్మతులకు అధికా రులు చర్యలు తీసుకుంటారా లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. పాలనా పాలన లేని కారణంగా భవన నిర్మాణ రూపురేఖలు కొల్పయోన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మరమ్మతులకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

- సుధాకర్, ఏఎస్‌డబ్ల్యూఓ, ఆదోని.



ఆదోని సబ్ డివిజన్లోని ఇంటిగ్రేటెడ్ ఎస్సీ హాస్టల్లో మరమ్మతులకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాము. ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, నందవరం హాస్టల్లో పరిస్థితి ప్రభుత్వానికి నివేదించాం. విద్యా సంవత్సరం ప్రారంభానికి ఇంకా సమయం ఉంది. నిధులు రాగానే యుద్ధప్రాతిపదికన కిటికీలకు అద్దాలు, గోడలకు రంగులు, ఇతర మరమ్మతు పనులు చేయిస్తాం. అధైర్య పడాల్సిన అవసరము లేదు.

నిర్లక్ష్యం చేస్తే ఆందోళన చేస్తాం

- శ్రీనివాసులు, ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి, ఆదోని.



హాస్టల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి, విద్యా సంవత్సరం ప్రారంభంలోగా తాగునీరు, మరుగుదొడ్ల ఏర్పాటు ఇతర సౌకర్యాలు కల్పించని పక్షంలో విద్యార్థులను సమకూర్చి ఆందోళన నిర్వహిస్తాం. హాస్టల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పరిష్కరించకుండా కాలయాపన చేశారు. ఇప్పటికైనా కళ్ళు తెరవని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తాం.

పేదవాళ్లను పైకి తేవడమే జగన్ లక్ష్యం

- ఆలూరును అన్ని విధాల అభివృద్ధి చేసి చూపిస్తా - వైసిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రతి ఒక్క పేదవాడిని అంచలంచలాగా పైకి తేవడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్య లక్ష్యం అని ఆలూరు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బుసినే విరుపాక్షి తెలిపారు. ఆదివారం చిప్పగిరిలో ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నిరుపేద అభివృద్ధి చెందడమే ముఖ్యమంత్రి కర్తవ్యం అన్నారు. వైయస్సార్ పాలనలో వైద్యం విద్య, వంటి వాటికి ప్రాముఖ్యతను ఇచ్చినట్లు తెలిపారు. జగనన్న పాలనలో ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వ ఆస్పత్రులకు తదితర వాటికి ప్రాముఖ్యత ఇచ్చి నిరుపేదలకు సహాయ సహకారాలు అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. చంద్రబాబు మాటలకు మోసపోవద్దని ప్రజలను కోరారు. కేవలం ఆంధ్రప్రదేశ్ బాగుపడాలంటే, తిరిగి ఈ సంక్షేమ పథకాలు అన్నికొనసాగాలంటే వైయస్ జగన్మోహన్ రెడ్డి తోనే సాధ్యమన్నారు. తాను వాల్మీకి బోయ కులానికి చెందిన వాడనవి, నిరుపేదనని అలాంటి తనకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి భరోసా కల్పించిన జగన్ మోహన్ రెడ్డిని జీవితాంతం గుర్తు పెట్టుకుంటానన్నారు. ఆలూరు చాలా వెనుకబడిందని ఆలూరుని అభివృద్ధి చేసి చూపిస్తానని నియోజకవర్గ ఓటర్లు తనకు అవకాశం కల్పించాలని తెలిపారు. ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రజాప్రతినిధులు వైసిపి నాయకులు కార్యకర్తలు 2024 లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తిరిగి సీఎం కుర్చీలో కూర్చోబెట్టుటకు సైనికుడిలా ప్రతి ఒక్కరూ పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. తాను ఆలూరు అభివృద్ధికి నియోజకవర్గ ప్రజలందరి మధ్య ఉంటూ సైనికుడిలా మీకోసం పనిచేస్తానన్నారు. నగర డోనా రిజర్వాయర్, వేదవతి ప్రాజెక్ట్, హంద్రీనీవా కాలువకు తూము,, ఆస్పరిలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ, ఆలూరు లో కార్మికులకు పరిశ్రమలను ఏర్పాటు చేయించుటకు శక్తివంచన లేకుండా కృషి చేసి కచ్చితంగా వీటిని నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. ఏ గ్రామానికి వెళ్లిన తెలుగుదేశం పార్టీ విడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి తండోపతండాలుగా చేరుతున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు పేర్కొంటున్నారన్నారు. వైసీపీ కన్వీనర్ జూటూరు మారయ్య పాల్గొన్నారు.


ఆలూరు వైసిపి సమన్వయకర్త విరుపాక్షిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యం

- వేదవతి నీటి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కృషి చేస్తా
- టిడిపి ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి వీరభద్ర గౌడ

ప్రజాశక్తి - దేవనకొండ

వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి జరిగిందేమీ లేదని రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని ఆలూరు టిడిపి అభ్యర్థి వీర భద్ర గౌడ అన్నారు. ఆదివారం దేవనకొండ టిడిపి పార్టీ కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. అనంతరం టిడిపి నాయకులు కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి పార్టీని ఆశీర్వదించి ఆలూరు నియోజకవర్గం నుండి టిడిపి పార్టీ అభ్యర్థిగా తనను గెలిపించి చంద్రబాబుకు కానుక ఇద్దామన్నారు. గెలిచిన వెంటనే వేదవతి సాగునీటి ప్రాజెక్టు రాష్ట్రంలో జగన్ సైకో పాలన కొనసాగించాడని స్థానిక సంస్థలను నిర్వీర్యం చేశారని, గ్రామాల అభివృద్ధి ఏమాత్రం పట్టించుకో లేదన్నారు. దేవనకొండ మండ లంలో హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు కింద 46వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా పంట కాలువల నిర్మాణాలను పూర్తి చేసేందుకు నిధులను కేటాయించకపోవడంతో అధికారికంగా సాగునీరు అందించలేకపోయిన ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ విజయ్ భాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు రాందాస్ గౌడ్, రామారావు నాయుడు,మల్లయ్య, మల్లికార్జున గౌడ్, రాజశేఖర్ గౌడ్, రాజగోపాల్ గౌడ్, సర్పంచులు భాస్కర్, చిన్న రామప్ప, శేషాద్రి రెడ్డి, నాయకులు మల కన్న, రాజా సాబ్, సుభాన్ ,బండ్లయ్య వివిధ గ్రామాల టిడిపి నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీరభద్ర గౌడ

సాగునీటి సమస్యపై
రాజకీయ పార్టీల వైఖరి వెల్లడించాలి : సిపిఎం

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో సాగునీటి సమస్య పరిష్కారం కోసం ప్రధాన రాజకీయ పార్టీల వైఖరి వెల్లడించాలని సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆ పార్టీ మండల కమిటీ సమావేశం జరిగిన అనంతరం వీరశేఖర్ మాట్లాడుతూ మండలంలో హంద్రీనీవా ప్రధాన సాగునీరు వనరుగా ఉందని 46 వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉండగా ఇప్పటివరకు అధికారికంగా పంట కాల్వల ద్వారా ఒక ఎకరకు కూడా సాగునీరు అందలేదని కేవలం రైతులు తమ అవసరాల రిత్యా కాలువలకు పైపుల ద్వారా మోటర్ల ద్వారా సాగునీరు సమకూర్చు కుంటున్నారని పంట కాలువల నిర్మాణంలో ప్రభుత్వాలు తీవ్రంగా నిర్లక్ష్యం చేసి మండల రైతాంగాన్ని మోసం చేస్తున్నాయని విమర్శించారు. అదేవిధంగా హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని కప్పట్రాళ్ల, కరివేముల ,తెర్నేకల్ గ్రామాల మధ్యలో ఉన్నటువంటి పెండింగ్ పనులు పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలోనే గుండ్లకొండ దగ్గర హంద్రీ నీవాకు స్లూయిజ్ ఏర్పాటు చేసి గుండ్లకొండ, గుడిమరాళ్ల బంటుపల్లి, చెలమ చలమెల, బేతపల్లి, కోటకొండ, మాచాపురం,వెంకటాపురం పల్లె దొడ్డి గ్రామాలకు సాగులు ఇవ్వచ్చని ఈ సమస్యపై రాజకీయ పార్టీలు తమ వైఖరిలో వెల్లడించాలని వారు డిమాండ్ చేశారు. అబద్ధపు మాటలు, బూటకపు రాజకీయ హామీలు ఇచ్చి ఎన్నికల్లో రాజకీయ నాయకులు లబ్ధి పొందాలని చూస్తున్నారని ఈ ఎన్నికలలో మండల రైతాంగం సాగునీరు సమస్యల పట్ల చిత్తశుద్ధితో కృషి చేసే నాయకుల్ని బలపరచాలని వారు విజ్ఞప్తి చేశారు. అందుకే అందరూ అభ్యర్థులు ఈ సమస్య పై స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు అశోక్, సూరి, మహబూబ్ బాషా పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వీరశేఖర్

శ్రీ మఠం సిబ్బందికి అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో విధులను సమర్థ వంతంగా నిర్వహించిన సిబ్బందిని గుర్తించి శ్రీ సుయతీంద్ర తీర్థుల పేరుతో అవార్డులను ప్రదానం చేశారు. గత మూడు రోజులుగా జరుగుతున్న శ్రీ మఠం పూర్వపు పీఠాధిపతులు శ్రీ సుయతీంద్ర తీర్థుల ఆరాధన మహోత్సవాలను పురస్కరించుకుని శ్రీ మఠం యాగశాలలో అవార్డులను అందజేసి ఆశీర్వదించారు. శ్రీ మఠం మేనేజర్లుగా విధులు నిర్వహిస్తున్న ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జ్యోషి, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతిఆచార్, సిఆర్వో విజయీంద్రాచార్, విఐపి భోజన శాల సూపర్ వైజర్ చిదంబరం ఆధ్యాత్మిక కార్యాలయ సిబ్బంది హనుమేశాచార్ దంపతులను పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు శేష వస్త్రం ఫల మంత్రాక్షతలు మెమొంటో అందజేసి ఆశీర్వదించారు.


అవార్డులు అందుకున్న యస్కే శ్రీనివాసరావు వెంకటేష జ్యోషి దంపతులు

నవోదయకు విద్యార్థుల ఎంపిక


హర్షవర్ధన్, చరిత, పావని

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని దేవనకొండ, పి కోటకొండ గ్రామాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు నవోదయ మనవాసి పాఠశాలకు ఎంపికయ్యారు. దేవనకొండకు చెందిన గొల్ల చరిత, హర్షవర్ధన్, కోటకొండ గ్రామానికి చెందిన పావని అనే విద్యార్థిని ఆరవ తరగతి ప్రవేశానికి నవోదయ పాఠశాలకు ఎంపికయ్యారు.

ఏ సమస్య వచ్చినా నేరుగా నన్ను కలవండి

- వైసిపి ఆలూరు నియోజకవర్గం అభ్యర్థి విరుపాక్షి

ప్రజాశక్తి - హొళగుంద

ముస్లిం మైనారిటీలు ఏ సమస్య వచ్చినా నేరుగా నన్ను కలిసి సమస్యలు పరిష్కరించుకోవాలని ఆలూరు నియోజకవర్గం వైసిపి అభ్యర్థి బి విరుపాక్షి సూచించారు. ఆదివారం భంగిడి బాష ఆహ్వానం మేరకు శాలి మసీదులో నమోజీ చేసి ప్రార్థనలో పాల్గొన్నారు. రోజా ఉన్న ముస్లిం సోదరులందరికీ పండ్లు ఫలహారాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం మరోసారి విజయ ఢంక మోగిస్తుందని తనను ఆలూరు నియోజకవర్గం నుండి అత్యధిక మెజారిటీతో గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉండి సేవ చేసుకుంటాను అన్నారు. పెండింగ్‌లో ఉన్న ధనాపురం టు వడగంట రోడ్డును ముంజూరు చేయించి పనులు ప్రారంభిస్తామన్నారు. ఎక్కడ ఏ సమస్య వచ్చిన నియోజకవర్గ ప్రజలు నేరుగా నన్ను కలిసి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ షఫీ ఉల్లా, నాయకులు ఈషా, ముస్లిం సోదరులు, వైసిపి కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ముస్లిం సోదరులకు పండ్లు ఇస్తున్న విరుపాక్షి

ఘనంగా ఈస్టర్ వేడుకలు


వాక్యోపదేశం చేస్తున్న ఫాదర్ కోలా విజయ రాజు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మండిగిరి ఆర్‌సిఎం చర్చిలో ఆదివారం విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ కోలా విజయ రాజు ఆధ్వర్యంలో ఈస్టర్ పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రపంచ మానవాళికి క్రీస్తు పునరుత్థానం ద్వారా వెలుగు వచ్చిం దన్నారు. కొవ్వొత్తులు వెలిగించి వేలాది మంది క్రైస్తవులు చర్చిలో ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సహాయక గురువు కెంగారు బాలరాజు, సిస్టర్లు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు. అదేవిధంగా సిఎస్ఐ ఓల్టీ నిటి చర్చిలో పాస్టర్ భాస్కర్ బాబు ఆధ్వర్యంలో తెల్లవారుజామున ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కల్వరి కొండ చర్చిలో ఆనందరాజు ఆధ్వర్యంలో చర్చిలో ప్రత్యేక ప్రార్థన చేశారు. ఎలాంటి తప్పు చేయక పోయిన సిలువలో మరణించి మూడో రోజు పునరుత్థానుడై లేచాడని వివరించారు. ఆయన సూచనలు పాటించి జీవితాలను సన్మార్గంలో నడవాలని కోరారు.


అల్పాహారం పంపిణీ చేసిన సభ్యులు

అభాగ్యులకు భోజనం పంపిణీ

ఆదోని పట్టణంలోని ఈస్టర్ వేడుకలను పురస్కరించుకొని అభాగ్యులు అనాథలు బిచ్చగాళ్లకు భోజనం పంపిణీ చేశామని క్రిస్టియన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు రిటైర్డ్ ప్రిన్సిపల్ లుర్ధయ్య నోబుల్ ఒకేషనల్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సంఘటి దేవదానం తెలిపారు. ఈస్టర్ పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఏసూ క్రీస్తు స్మృతిలో జరుపుకునే వేడుక ఈస్టర్ అని వారు తెలిపారు. పట్టణంలోని కొత్త బస్టాండు రైల్వే స్టేషన్ పాత బ్రిడ్జి ప్రాంతాలలో పర్యటిస్తూ పేదలకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్ న్యూటన్ రాజు, సుధాకర్, ఆది మూర్తి, మధు , ప్రేమ్ కుమార్, బసప్ప, చెన్నయ్య, రమేష్, అశోక్, దీపక్ శర్మ పాల్గొన్నారు.

ఆలూరు : ఈస్టర్ పండుగ వేడుకలు ఆదివారం ఆలూరు పట్టణంలోని ఆర్‌సీఎం, హొసన్నా, హొరేబు మందిరాలలో పాటు మండలంలోని ఎం.కోట్టాల, హత్తిబెలగల్, మనేకుర్తి,హులేబీడు గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలూరు సిఎస్ఐ చర్చ్ లో పాస్టర్ రెవరెండ్ పాల్ బెనోహర్ బాబు మాట్లాడుతూ ఏసుక్రీస్తు సిలువలో మరణించి మూడవ రోజు తిరిగి లేచిన రోజును యావత్ దేశం ఈస్టర్ పండుగగా జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి దేవదానం,కోశాధికారి సుకుమార్,సభ్యులు విజయ రాజ్,జాన్, రాజన్న, రాజశేఖర్,విజయ నిర్మల,జయమ్మ,వినోద్,చిన్న,ప్రభాకర్,విజయ్ పాల్గొన్నారు.


ఆలూరు సిఎస్ఐ చర్చ్‌లో సందేశమిస్తున్న రెవరెండ్ పాల్ బెనోహర్

పెద్దకడబూరు : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఈస్టర్ పండుగను ఘనంగా నిర్వహించారు. యేసుక్రీస్తు సిలువ మరణం పొంది మూడవ రోజు ఆదివారం పునరుత్థానం పొందన సందర్భంగా క్రైస్తవులు ఈస్టర్ పండుగను జరుపుకుంటారు. ఉదయం నుంచే చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిం చారు. సిఎస్ఐ పాస్టర్ రెవరెండ్ ముత్తుమనోహర్ బాబు, ఆర్ సిఎం ఫాదర్ సంజీవ్ ఆధ్వర్యంలో బోధనలు చేశారు.

సిఎస్ఐ చర్చి నిర్మాణానికి విరాళం

పెద్దకడబూరు గ్రామంలోని సీఎస్ఐ చర్చి నిర్మాణానికి గుంటూరు మిర్చి యార్డులోని విజయ కార్తిక్ మిర్చి ట్రేడర్స్ యజమానులు, పెద్దకడబూరుకు చెందిన కాంగ్రెసు పార్టీ జిల్లా కార్యదర్శి కురువ గుడిసె నరశింహులు సంయుక్తంగా రూ. 40 వేల నగదును ఈస్టర్ పండుగను పురస్కరించుకుని పాస్టర్ రెవరెండ్ ముత్తు మనోహర్ బాబు సంఘ పెద్దలకు అందజేశారు. గుంటూరు మిర్చి యార్డులోని విజయ కార్తిక్ మిర్చి ట్రేడర్స్ యజమానులు రూ. 30 వేలు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కురువ గుడిసె నరశింహులు రూ. 10 వేలు సీఎస్ఐ చర్చి నిర్మాణానికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ ముత్తు మనోహర్ బాబు కానుక ఇచ్చిన దాతల గురించి ప్రత్యేక ప్రార్థన చేశారు. దాతలు క్రైస్తవ సోదరులకు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు కోడిగుడ్ల ఏసేపు, ఐఎన్ టీయుసీ జిల్లా ఉపాధ్యక్షులు బొగ్గుల జోసఫ్, మిరప రైతులు, సంఘ పెద్దలు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.


సిఎస్ఐ చర్చి నిర్మాణానికి విరాళం ఇస్తున్న నేతలు

సంఘం బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఏపి బీజేఏ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అసోసియేట్ అధ్యక్షులు శ్రీహరి, అధ్యక్షులు శ్రీ కె.నాగేంద్రప్ప, జిల్లా కార్యదర్శియస్. తిరుపాలయ్యలు కోరారు. స్థానిక జిల్లా కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు కె.నాగేంద్రప్ప ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో జిల్లా కార్య వర్గ సభ్యులు, అన్నీ తాలూకా, అధ్యక్ష, కార్యదర్శులు, మహిళా అధ్యక్ష, కార్యదర్శి కార్య వర్గ సభ్యులు, సిటి కార్యవర్గ సభ్యులు తదితరులు హాజరయ్యారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సంఘం అదేశానుసారము 2024 సభ్యత్వ నమోదు, ఖాళీగా ఉన్న అసోసియేట్ అధ్యక్షులుగా హరిని, జిల్లా కార్యదర్శి పదవి యస్.తిరుపాలయ్యని, కోశాధికారిగా బి.శ్రీనివాసులుని ఎన్నుకున్నారు. అలాగే జిల్లాలో వివిధ సంఘాలతో ఐక్యవేదిక ఏర్పాటు చేయుట గురించి చర్చించారు. తాలూకాలలో సంఘానికి బలోపేతం చెయ్యడానికి ఏప్రిల్ నెలలో జిల్లా నాయకులు తాలూకాలు పర్యటించడం జరుగుతుందని అసోసియేట్ అధ్యక్షులు శ్రీహరి, జిల్లా కార్యదర్శి ఎస్.తిరుపాలయ్యలు తెలిపారు. నూతన అధ్యక్షులు కె.నాగేంద్రప్పని సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోషాధికారి బి.శ్రీనివాసులు, జగదీశ్వరప్ప, సిటీ అధ్యక్షులు సత్యం, కార్యదర్శి శ్రీనివాసులు, కోయిలకుంట్ల తాలూకా కార్యదర్శి లక్ష్మీనారాయణ, మహిళా నాయకురాలు లక్ష్మి దేవమ్మ, ఖుషన్నూర్, ఎస్.హేమలత తదితరులు పాల్గొన్నారు.

టిడిపిని వీడి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యం మండలంలోని ఆయా గ్రామాలలో ఎమ్మెల్యే కాటసాని రాం భూపాల్ రెడ్డి సతీమణి కాటసాని ఉమా మహేశ్వరమ్మ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. చేసిన మంచిని చూసి రాబోయే ఎన్నికల్లో కాటసానిని గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రచారంలో భాగంగా మద్దూరు గ్రామానికి ప్రచారానికి విచ్చేసిన శ్రీమతి కాటసాని ఉమామహేశ్వరమ్మ గారి సమక్షంలో టిడిపిని వీడి వైసీపీలో కి ఓబులం ప్రభాకర్ రెడ్డి మాజీ ఎస్ఆర్బిసి చైర్మన్ ఓబుల మహేశ్వర్ రెడ్డి కుటుంబాలు చేరాయి. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సూర్యనారాయణ రెడ్డి, జడ్పీటీసీ సరళమ్మ, ఎంపీపీ హుసేన్ బి, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, మద్దూర్ సర్పంచ్ ప్రదీప్ రెడ్డి, సుమంత్ రెడ్డి, మహేంద్ర రెడ్డి,చంద్ర రెడ్డి, వినోద్ రెడ్డి, గ్రామ నాయకులు, మండలంలోని వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

టిడిపిలోకి రిటైర్డ్ ఆర్మీ జవాన్లు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాలలోని టిడిపి కార్యాలయంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్లు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన మౌలాలి, వెంకటేశ్వర్లు, హఫీజిల్లా, షేక్ ఫక్రుద్దీన్, వివి సుబ్బయ్య, లక్ష్మీ నాయక్, ఎల్ నాయక్, కోటేశ్వరరావు, మల్లారెడ్డి, తాహెర్ అహ్మద్, మధుసూదన్ బాబు, రఫీ తదితరులకు నంద్యాల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్, మాజీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఏవి సుబ్బారెడ్డి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి తులసి రెడ్డి టిడిపి కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రిటైర్డ్ ఆర్మీ జవాన్లు తెలుగుదేశం పార్టీలో చేయడం శుభ సూచికమన్నారు. నంద్యాల ఎమ్మెల్యే సీట్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకొని చంద్రబాబు నాయుడుకి గిఫ్ట్‌గా ఇవ్వాలన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన పూజలు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల సుంకులమ్మ వీధిలో ఉన్న సుంకులా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో దేవాలయానికి అనుబంధంగా నిర్మించిన నూతన పూజా మండప భవనంలో శనివారం ప్రారంభమైన పూజలు, హెూమాలు ఆదివారం పూర్ణాహుతితో ముగిశాయి. రెండు రోజులపాటు ప్రవీణ్ స్వామి, వేణుగోపాలస్వామి, శివ శర్మ బృందం ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. పూర్ణాహుతి కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ గుర్రాల రవికృష్ణ, గౌరవ అధ్యక్షులు గోపిశెట్టి వెంకటసుబ్బయ్య, కార్యదర్శి చిమ్మా నాగన్న, ఉపాధ్యక్షులు ఎచ్చెర్ల నరసింహారావు, సిరిగిరి రామకృష్ణ, కమిటీ సభ్యులు బైగ్గారి ప్రసాద్, గోపిశెట్టి రమేష్, గోపిశెట్టి ప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ 30 లక్షల రూపాయల వ్యయంతో దేవాలయంలో అభివృద్ధి పనులు, నూతన పూజా మండప భవన నిర్మాణం పూర్తి చేశామన్నారు. ఏప్రిల్ 24న నూతన ధ్వజ స్తంభాల ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఏప్రిల్ 9వ తేదీ ఉగాది రోజు నంద్యాల పట్టణంలో వేలాది మంది భక్తులు సుంకులమ్మకు నైవేద్యం సమర్పించడానికి వస్తారని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రవికృష్ణ, గౌరవాధ్యక్షులు గోపిశెట్టి వెంకటసుబ్బయ్య, కార్యదర్శి చిమ్మా నాగన్న తదితరులు.

వైసిపి నుండి 50 కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని రామతీర్థం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సమక్షంలో ఆదివారం టిడిపిలో చేరారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో రామతీర్థం వైసిపి నాయకులు చాగలమర్రి రామకృష్ణుడు, చాగలమర్రి రమణ, తుపాకుల ప్రసాద్, తుపాకుల సుధాకర్, పోలం శేఖర్, కోవెలకుంట్ల ఆజాం, సలాం వెంకటేశ్వర్లు, ముల్ల మాలి, ముల్ల మహమ్మద్ గౌస్, దొరాశి శ్రీను, కందుకూరి భాస్కర్, రేవనూరు పెద్ద హుస్సేన్ సా, మర్రి చిన్న మద్దిలేటి, మర్రి మదన్ గోపాల్, మర్రి మద్దయ్య, షేక్ అబ్బాష్, ఈడిగ రామాంజనేయులు, చాకలి ఆంజనేయులు, చాకలి ఈశ్వరయ్య, చాకలి నరసింహుడు, పెద్ద వలి, చాగలమర్రి హుస్సేనప్ప, డొల్లు జంగమయ్య, డొల్లు గోపాల్ తదితర 50 కుటుంబాలు టిడిపిలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బిసి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. అందరం కలిసికట్టుగా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగా చేసుకుందామని కోరారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి ఏ కష్టం వచ్చిన అండగా ఉంటామని, పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు.

కొలిమిగుండ్ల మండలం బందర్లపల్లె నుండి : కొలిమిగుండ్ల మండలం బందర్లపల్లె గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఆ పార్టీని వీడి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. వైసిపి అంకెల భాస్కర్ రెడ్డి, కోన శివశంకర్ రెడ్డి, కోన భారతి, కిష్టపాటి అరుణాదేవి, మల్లికా దేవి, పుష్పవతి, వలి, సుకూర్ బాషా, మక్కల వెంకట రాముడు, గోగుల రామచంద్ర, రంగ మంజుల, గోపాల్ రెడ్డి పుట్లూరి, బోయ వెంకట ఆంజనేయులు, గోగుల చంద్ర, ప్రభావతి, సిద్దయ్య, కిష్టిపాటి మద్దయ్య, బోయ రఘురామ్ తదితర 25 కుటుంబాలు టిడిపిలో చేరారు. వైసిపి ప్రలోభాలు పెట్టి రెండు రోజుల క్రింతం కండువా కప్పిన ప్రభావతి, సిద్దయ్య, గోగుల చంద్ర తిరిగి బిసి సమక్షంలో టిడిపి కండువా కప్పుకున్నారు.



మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరుతున్న వైసీపీ నాయకులు

శేషారెడ్డి ప్రభుత్వ వైద్యశాలలో

శిశు మరణాలపై సమగ్ర విచారణ జరిపించాలి : సిపిఐ

ప్రజాశక్తి - బేతంచర్ల

బేతంచెర్ల కేశవరెడ్డి ప్రభుత్వ వైద్యశాలల పసిపిల్లల మరణాలపై సమగ్ర విచారణ జరిపించి అందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల వద్ద వారు మాట్లాడుతూ మగ శిశువు మృతి చెందాడని, జిల్లా అధికారులతో సమగ్ర విచారణ జరిపి అందుకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రశ్నించిన సిపిఐ నాయకులపై అసభ్య పదజాలం వాడిన డాక్టర్ చరణ్ రాజుపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. బేతంచర్ల మండలంలోని అంబాపురం గ్రామానికి చెందిన గర్భిణీ ప్రసవం నిమిత్తం సుమారు మూడు రోజుల కిందట బేతంచెర్ల పట్టణంలోని శేషారెడ్డి ప్రభుత్వ వైద్యశాలలో చేరారని తెలిపారు. స్థానిక డాక్టర్ల నిర్లక్ష్యం కారణం వల్ల శేషారెడ్డి ప్రభుత్వ వైద్యశాలలో పసిపిల్లల మరణాలు నిత్యం సర్వసాధారణమై పోయాయని అన్నారు. మార్చి 13వ తేదీ న శిశువు మృతి చెందిన ఘటన మరువకముందే అదే పద్ధతిలో మళ్లీ ఈరోజు మగ శిశువు మృతి చెందడం బాధాకరమన్నారు. బేతంచెర్లలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని గొప్పలు చెప్పే ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ దృష్టిలో పేద బడుగు బలహీన వర్గాల ప్రజల ప్రాణాలకు విలువ లేదని, ప్రభుత్వ డాక్టర్ల సిబ్బంది నిర్లక్ష్యానికి పసిపిల్లల ప్రాణాలు గాలిలో కలిసిపోతుంటే మానవత్వం లేని అధికారులకు దున్నపోతులపై వర్షం కురిసినట్టుగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. తక్షణమే డాక్టర్ చరణ్ రాజు పై క్రిమినల్ కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

బాధితులను పరామర్శించిన సిపిఐ, ఎఐఎస్ఎఫ్ నాయకులు

బేతంచర్ల పట్టణంలోని శేషారెడ్డి ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవ సమయంలో మగ శిశువు మృతి చెందాడని విషయం తెలుసుకున్న సిపిఐ మండల కార్యదర్శి భార్గవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్‌లు ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పసికందుల మృతిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎల్లా కృష్ణ, మండల నాయకులు మధు, శ్రీకర్, దిలీప్, ప్రదీప్, మారుతి, శ్రీకాంత్, శరత్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబుకు బొక్కె అందజేసిన రాఘవేంద్ర రెడ్డి

టిడిపి అభ్యర్థిగా రాఘవేంద్ర రెడ్డి ప్రకటనపై సంభరాలు

ప్రజాశక్తి - మంత్రాలయం: మంత్రాలయం టిడిపి అభ్యర్థిగా మాధవరం ఎన్ రాఘవేంద్ర రెడ్డిని చంద్రబాబు నాయుడు ప్రకటించడం పై ఆ పార్టీ నాయకులు సంభరాలు జరుపుక న్నారు. ఆదివారం స్థానిక రాఘవేంద్ర సర్కిల్లో వరదరాజులు ఆధ్వర్యంలో బాణా సంచా పేల్చి సంభరాలు జరుపుకున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలో జరిగిన ప్రజా గళం సభలో మంత్రాలయం టిడిపి అభ్యర్థిగా ప్రకటించి నియోజక వర్గ ప్రజలకు ఉన్న అయోమయాన్ని తొలగించారు. వాల్మీకి వర్గానికి చెందిన రాఘవేంద్ర రెడ్డిని ఆశీర్వదించాలని చంద్రబాబు పరిచయం చేయడం టికెట్‌పై అనుమానాలు తొలగినట్లు కనిపిస్తున్నా బి బి ఫారం వచ్చే వరకు నమ్మకాలు లేవని అనుమానాలను కొందరు వ్యక్తం చేస్తున్నారు. బాబును కలిసి శాలువతో బొక్కెను అందజేసిన రాఘవేంద్ర రెడ్డికే టికెట్ ఖాయమని గెలవడం కూడా అని వర్గీయులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నవోదయ ఫలితాలలో ఆజాద్ ప్రభంజనం

ప్రజాశక్తి - ఆస్పరి: జవహర్ నవోదయ ఫలితాలలో ఆజాద్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 2024 జవహర్ నవోదయ 6 వ తరగతి ప్రవేశ పరీక్ష కొరకు నలుగురు విద్యార్థులు అబ్దుల్ అజీజ్,నాని,చరిత,ధర్మ తేజ పరీక్ష రాయగా నలుగురు విద్యార్థులు ఫలితాలు సాధించడం గమనార్హం. కర్నూలు జిల్లా ఆలూరు బ్లాక్ సంబంధించి నాలుగు సీట్లు ఉండగా ఆ నాలుగు సీట్లు తమ విద్యార్థుల దక్కించు కున్నారని నాగలదిన్నె అజారుద్దీన్ తెలిపారు. కోచింగ్ సెంటర్ ఏర్పాటుచేసిన మొదటి ఏడాదినే ఉత్తమ ఫలితాలు సాధించడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. నవోదయ సీటు సాధించడంతో కోచింగ్ సెంటర్ లో సంబరాలు జరుపుకున్నారు.



గ్రంథాలయానికి పుస్తకాలు విరాళం

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని గ్రంథాలయానికి గుర్రెడ్డి కాంప్లెక్స్‌కు చెందిన ఏవీఎస్ రామ గోవిందయ్య కుమారుడు ఏవీఎస్ సాయి జయంత్ నాలెడ్జ్ పుస్తకాలను విరాళంగా ఇచ్చినట్లు గ్రంథాలయ అధికారి జలాల్ బషీర్ అహ్మద్ ఆదివారం తెలిపారు. ఏవీఎస్ సాయి జయంత్ వ్యక్తిత్వం, విద్యా, వికాసం (డాక్టర్ పట్టాభి, యండమూరి వీరేంద్రనాథ్, బివి.సత్య గణేష్) ద్వారా తయారు చేయబడిన సీడీలు, ప్రపంచంలో జరిగిన ఒక వెయ్యి ఒకటి (1001) చరిత్రలకు సంబంధించిన సమాచారం దాదాపు 12 వేల రూపాయలు విలువ గలిగిన పుస్తకాలను విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి జలాల్ బషీర్ అహ్మద్ వారిని అభినందించారు. ఈ పుస్తకంలో చాలా విలువ కలిగినట్లుగా భావిస్తూ విద్యార్థిని విద్యార్థులు గ్రంథాలయాన్ని సందర్శించి సమాచారాన్ని తెలుసుకోవాలని గ్రంథాలయ అధికారి తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాన్ని సందర్శించి శాశ్వత సభ్యులుగా వంద రూపాయల రుసుముతో పుస్తకాలను ఇళ్ళకు తీసుకెళ్లవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని తమ పిల్లలను ప్రతి తల్లిదండ్రులు గ్రంథాలయాన్ని సందర్శించేలా తద్వారా భావితరాలకు వారి ద్వారా సమాజ శ్రేయస్సు వరకు సహకరించాలని కోరారు.



గ్రంథాలయానికి పుస్తకాలు విరాళం ఇస్తున్న దృశ్యం

టిడిపి పార్టీలో చేరిన

మాదాసి కురువ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురువ మద్దిలేటి

కండవా కప్పి ఆహ్వానించిన మాజీ సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ఎమ్మిగనూరు ప్రజాగళం సభలో మాదాసి కురువ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఉన్న కురువ మద్దిలేటి బి.వి జయనాగేశ్వర్ రెడ్డి, పంచలింగాల నాగరాజు ఆధ్వర్యంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుతో కండువా కప్పించుకొని టిడిపి పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా కురువ మద్దిలేటి మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు కురువలను గుర్తించి కురువ కులానికి చెందిన పంచలింగల నాగరాజుకు ఎం.పీ టికెట్ ఇచ్చి , మాదాసి కురువ ఎస్సీ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ వచ్చే విధంగా కృషి చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా ఎమ్మిగనూరు, మంత్రాలయం, కర్నూల్ పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో ఉన్నటువంటి మా కురువ కులస్తులను చైతన్యపరిచి ఎంపీ అభ్యర్థి పంచలింగాల నాగరాజును, ఎమ్మిగనూరు నియోజకవర్గ అభ్యర్థి బి.వి జయ నాగేశ్వర్ రెడ్డి గారిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమమునకు నియోజకవర్గ కురువ కులస్తులు భారీగా పాల్గొన్నారు.



కురువ మద్దిలేటి ని పార్టీ కండువా కప్పి టిడిపి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నారా చంద్రబాబు నాయుడు

అవకాశం ఇవ్వండి అభివృద్ధి చేసి చూపిస్తా

- జై భారత్ పార్టీ అభ్యర్థి ప్రొఫెసర్ షేక్ షా వలి

ప్రజాశక్తి-ఆలూరు

గత ప్రభుత్వాలు,పాలకుల నిర్లక్ష్యంతో ఆలూరు అభివృద్ధికి నోచుకోలేదని ఒక్కసారి తమ పార్టీకి,తనకు నియోజకవర్గ ఎంఎల్ఏ గా అవకాశం ఇచ్చి చుడండి అభివృద్ధి చేసి చూపిస్తానని జై భారత్ పార్టీ ఆలూరు అసెంబ్లీ అభ్యర్థి ప్రొఫెసర్ షేక్ షా వలి కోరారు.ఆదివారం ఉమా ఫంక్షన్ హల్‌లో కార్యకర్తల సమావేశంలో అయన మాట్లాడుతూ తన తండ్రి రిటైర్డ్ టీచర్ ఆలూరులో బాయ్స్ -1, కమ్మరచేడు పాఠశాల లో, హెూళగుంద మండలం లోని హైస్కూల్ లో విధులు నిర్వహించాడని తను ఈ మండలంలోనే విద్యాభ్యాసం చేస్తూ ఆలూరు లో నివాసం ఉండేవారమని ఉద్యోగరీత్యా ప్రొఫెసర్‌గా ఆదోనిలో ఉండిపోయామ్మన్నారు. జెడి.లక్ష్మీనారాయణ విధానాలకు ఆకర్షతునై జై భారత్ పార్టీ లో చేరినట్లు తెలిపారు. తాను కష్టాలను అనుభవించిన ఆలూరు,జిల్లాలోనే అన్నిరంగాలలో వెనుకబడిందని నియోజకవర్గాని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని సంకల్పంతో ఎంఎల్ఏ గా పోటి చేస్తున్నట్లు తెలిపారు. గెలిచినా తరువాత నగరడోన, వేదవతి రిజర్వాయర్ లను పూర్తి చేసి సాగు, తాగు నీరు అందజేస్తామన్నారు. జింకల బెడదా నుండి శాశ్వత పరిష్కారం చేస్తామన్నారు. హాలహర్వి, దేవనకొండ, ఆస్పరి మండలంలో ఇంటర్, పాల్ టెక్నీకల్,డిగ్రీ, ఐటిఐ కళాశాలలు నిర్మాణం చేపడుతామన్నారు. ఇలాంటి అభివృద్ధి పనులను చేపడుతానని నియోజకవర్గ మ్యానిఫెస్టో ని తన తండ్రి తో కలసి విడుదల చేశారు.కావున నియోజక వర్గ ఓటర్లు జై భారత్ పార్టీ గుర్తు టార్చి లైట్ గుర్తుపై ఓటు వేసి వేయించి గెలిపించాలని కోరారు.అంతకుముందు ఆలూరు ప్రధారహదారి గుండా కార్యకర్తలతో కలసి ర్యాలీగా వచ్చి అంబెద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నీవల్లర్పించారు.



టిప్పర్ డ్రైవర్‌ను అసెంబ్లీకి పంపాలనుకోవడం జగన్మోహన్ రెడ్డి తప్పా?

- చంద్రబాబు వ్యాఖ్యల పై స్పందించిన ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

టిప్పర్ డ్రైవర్ ని అసెంబ్లీకి పంపాలని అనుకోవడం జగన్మోహన్ రెడ్డి తప్పా అని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ప్రశ్నించారు. ఆదివారం మండల పరిధిలోని ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురం గ్రామంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఏమని చెబుతోందని దేశంలోని ప్రతి ఒక్కరూ సమానమైన హక్కులుంటాయని సమాన అవకాశాలు, సమాన హక్కులు ఉంటాయికాని చంద్రబాబుకు తెలియదా అని ప్రశ్నించారు. పొట్టకూటి కోసం డ్రైవర్ వృత్తిని చేపడితే హాహాహా టిప్పర్ డ్రైవర్ కు టిక్కెట్టు ఇచ్చారు అంటూ అవహేళన చేయడం చంద్రబాబుకే చెల్లిందని ఎద్దేవా చేశారు. టిప్పర్ డ్రైవర్ కు వైయస్ జగన్ టిక్కెట్టు ఇవ్వడం పై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో పెద్ద దుమారాన్నే రేపాయని నిజమే.. వీరాంజనేయులు ఒక సాధారణ ట్రక్కు డ్రైవరే నిరుపేద దళిత కుటుంబానికి చెందిన సామాన్యుడే అయితే కష్టపడి ఎంఎ బిఇడి చేసిన విద్యావంతులని తెలిపారు. కుటుంబ పోషణ కోసం ట్రక్కు డ్రైవర్‌గా పని చేస్తున్న ఆయనకు వీరాంజనేయులుకు ధనబలం లేక పోవచ్చని కుల భలం లేదని కానీ చూడడం సమంజసం కాదని వైసిపి కి మాత్రం సంపూర్ణ విశ్వాసం మాత్రం ఉందని పేర్కొన్నారు. ప్రజాసేవ చేయాలనే తలంపు ఉందని దాంతో వైయస్సార్ కాంగ్రెస్ లో చేరి కష్టపడి గుర్తింపు తెచ్చుకున్నాడని ఆర్థికంగా ఎంఎల్ఏ గా పోటీ చేసే స్థాయి లేకపోయినా వీరాంజనేయులలో ప్రజాసేవ పట్ల ఉన్న అంకితభావాన్ని గుర్తించి జగన్ గారు పిలిచి టిక్కెట్టు ఇచ్చారని చెప్పారు. చంద్రబాబు ప్రచారానికి వెళ్లినప్పుడు తమ పార్టీ రాష్ట్రానికి,ప్రజలకు ఏమి చేస్తుందో చెప్పాలని దానికి మద్దతు ఇవ్వమని ప్రజలను కోరాలి కాని చేసిందేమిటి దళితుడైన వీరాంజనేయులు తమ పక్కన అసెంబ్లీలో కూర్చుంటే చూడలేని తనంతో ఉన్నట్లుగా చంద్రబాబు వ్యాఖ్యలు ఉన్నాయని అన్నారు. పైగా టిప్పర్ డ్రైవర్ గా పనిచేసే వీరాంజనేయులు ఏంటి తమ పక్కన కూర్చునేలా అసెంబ్లీకి పోటీ చేయడం ఏంటి అని భావించినట్లు తెలుస్తోందని నిజానికి పేదలు, దళితులంటే చంద్రబాబుకు మొదటి నుంచి చాలా అలుసే కదా ఆవేధన చెందారు. తరచూ వారిని హేళన చేస్తూ మాట్లాడడం ఆయనకు పరిపాటిగా మారిందన్నారు. తాను సీఎంగా ఉన్న సమయంలోనే ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అంటూ అవహేళన చేసిన సంగతి అందరికీ తెలిసిందే అన్నారు. మరో సందర్భంలో తోకలు కత్తిరిస్తానంటూ బీసీలను బాహాటంగా బెదిరించి ఆయన తన కులోన్మాదం ప్రదర్శించారని విమర్శించారు. తాజాగా శింగనమల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీరాంజనేయులును ఘోరంగా అవమానించడం ఒక టిప్పర్ డ్రైవర్ వైసిపి అభ్యర్థి అంటూ హేళన చేస్తూ మాట్లాడడం ద్వారా పేదలు, కార్మికులు, దళితులు ఎన్నికల్లో పోటీకి, చట్టసభలలో కూర్చునేందుకు పనికిరారనే రీతిలో కించపరిచారని వేలాది మంది ప్రజల మధ్యన బహిరంగ సభలో బాహాటంగా తన పెత్తందారీ పోకడలు నిస్సిగ్గుగా బయటపెట్టుకున్నారని అన్నారు. వీరాంజనేయులు నిబద్ధతను గుర్తించి శింగనమల టికెట్ ఇచ్చి గౌరవ ముఖ్యమంత్రి శ్రీ వైఎస్ జగన్ గారు సముచితంగా గౌరవించారు. కష్టపడి రాజకీయాల్లో పైకొచ్చిన జగన్ గారు వంటి నేతలకు మాత్రమే సామాన్యులు, దళితుల గురించి సవ్యంగా ఆలోచన చేసే గుణం ఉంటుంది.40 ఏళ్ళ రాజకీయం, 14 ఏళ్ళు సీఎంగా పనిచేసిన చంద్రబాబు నిరుద్యోగాన్ని పెంచి పోషించినందునే ఎందరో నిరుపేద దళిత బిడ్డలు ఉన్నత చదువులు చదివి కూడా టిప్పర్ డ్రైవర్లుగా, కూలీలుగా మారిపోయారని ఆరోపించారు. ప్రజలు చంద్రబాబు వ్యాఖ్యల నేపథ్యంలో వీరాంజనేయులను అసెంబ్లీకి పంపడం ద్వారా చంద్రబాబు లాంటి వారికి చెంపపెట్టులాంటి తీర్పు శింగనమల ప్రజలు ఇస్తారని భావిస్తున్నట్లు ధీమా వ్యక్తం చేశారు.



రోళ్ళపాడుతండాలో మారెమ్మ దేవత నూతన ఆలయం

3 న చండీయాగం

4 న మారెమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలం రోల్లపాడు తండాలో ఏప్రిల్ 3న చండీయాగం నిర్వహించారు. 4న మారెమ్మ దేవత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించ నున్నారు. గిరిజనులు ఆరాధ దైవం మారెమ్మ దేవత. రోళ్లపాడు తండాలోని గిరిజనుల కోరిక మేరకు కడమకుంట్ల గ్రామపంచాయతీ వైసిపి నాయకుడు ఊటకంటి అమర్నాథ్ రెడ్డి దాదాపు తన సొంత డబ్బులతో రోల్లపాడు తండాలో మారెమ్మ దేవత ఆలయాన్ని నూతనంగా నిర్మించారు. ఈ ఆలయంలో మారెమ్మ దేవత, బొడ్డురాయి, నాగదేవతలను ప్రతిష్ట చేయనున్నారు. ఏప్రిల్ 2 నుండి 4వ తేదీ వరకు ప్రముఖ వేద పండితుడు బేల్దోన్ స్వామి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ట కార యక్రమాలు నిర్వహించ నున్నారు. 3వ తేదీన చండీ యాగం యాగం నిర్వహించి 4న దేవత మూర్తులను ప్రతిష్ట కార్యక్రమం కొనసాగుతాయి. అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీ దేవి వస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వైసిపి నాయకుడు ఊటకంటి అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామ సమీపంలోనే రోళ్లపాడు తండాలోని గిరిజనుల కోరిక మేరకు తాను సొంత డబ్బులతో ఆలయాన్ని నిర్మించి, విగ్రహ ప్రతిష్ట చేయనున్నామన్నారు. రెండు రోజుల కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.



మారెమ్మ దేవాలయం

టిడిపి కర్నూలు మండల కన్వీనరుగా బుర్ర వెంకటేష్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: టిడిపి కర్నూలు రూరల్ మండల కన్వీనర్‌గా బుర్రవెంకటేష్ నాయుడును ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఆదివారం విజయవాడ లోని ఎ1 కన్వెన్షన్ హాలులో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన తెలుగుదేశం పార్టీ ఎన్నికల వ్యూహం - అభ్యర్థుల వర్క్‌షాపులో కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షులు, జిల్లా అభ్యర్థులతో కలిసి వారు పాల్గొన్నారు. కోడుమూరు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బొగ్గుల దస్తగిరి కర్నూలు మండల మాజీ కన్వీనర్లు బియు వెంకటేశ్వర్లు, బుర్ర వెంకటేష్, గూడూరు మండల మాజీ కన్వీనర్ జె. సురేష్ గార్గేయపురం కౌశిక్ రెడ్డి ఐటిడిపి బోయకృష్ణ, రామాంజనేయులు, శంకర్, భాస్కర్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.వారిని పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు అభినందించారు. టిడిపి అభ్యర్థి బొగుల దస్తగిరి గెలుపు కోసం తానుకృషి చేస్తానని, మండలంలో టిడిపిని మరింత బలోపేతం చేసేందుకు సాయ శక్తులా శ్రమిస్తానని తెలిపారు.



సూర్యనారాయణ ఆలయం ఆధ్వర్యంలో తాగునీరు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : గురుదత్త శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ ఆశీస్సులతో కర్నూలు శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం కమిటీ వారి ఆధ్వర్యంలో దేవాలయం దగ్గర ఫ్లయ్ ఓవర్ కింద ఈ వేసవిలో దాహార్తిని తీర్చుటకు చల్లని ఉచిత మంచినీటి ప్యాకెట్స్ పంపిణీ చేశామని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వేసవి దాహార్తిని తీర్చుకున్నారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్ నగేష్, డాక్టర్ కృష్ణమోహన్, భీమిశెట్టి, ప్రకాష్, శ్రీదేవి, డాక్టర్ నాగజ్యోతి, దేవాలయం స్టాప్ అందరూ పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేశారు.

